క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ తనిఖీ



స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

బెళుగుప్ప: స్థానిక పోలీస్ స్టేషన్‌ను గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని కేసుల నమోదు, ఫిర్యాదులపై ఎస్ఐ శివతో ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మసీదులో ఇఫ్తార్ విందు

రాయదుర్గంటౌన్: ఓబుళాచారి రోడ్డులో మక్కా మసీదులో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు జరిగింది. కాలనీకి చెందిన చికెన్ మొహమ్మద్, షమీవుల్లా, రఫీక్, మహబూబ్ బాష, జావెద్, రోషన్, మొహిద్దీన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యిమంది ముస్లింలు ఇఫ్తార్‌కు హాజరయ్యారు. మసీదు ఇమాం ముఫ్తీ నూర్ మహమ్మద్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో దీక్షాపరులకు ఇఫ్తార్ ఇవ్వడం పుణ్యఫలమన్నారు.

మద్దానేశ్వరస్వామికి పానకాలు సమర్పణ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన వాల్మీకి సామాజికవర్గం భక్తులు సోమవారం సాయంత్రం ఉడేగోళం గ్రామంలో వెలసిన మద్దానేశ్వరస్వామికి పానకాల సమర్పణను ఘనంగా నిర్వహించారు. ఎడ్లబండ్లను ప్రత్యేకంగా అలకరించి, స్వామికి సమర్పించే పానకాలు బండిలో ఉంచి మహిళలు కళాశాలతో బయల్దేరారు. వాల్మీకి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు బండి కిష్టప్ప పానకాల ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం స్వామి వారి సన్నిధికి చేరుకుని పానకాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రతి రైతుకూ డ్రిప్,స్ప్రింక్లర్లు



ప్రిలిమినరీ తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వజ్రకరూరు: జిల్లాలోని అర్హులైన ప్రతి రైతుకూ డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేయనున్నట్లు ఏపీ ఎంఐపీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. సోమవారం వజ్రకరూరు మండలంలో డ్రిప్,స్ప్రింకర్ల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పర్యటించారు. వజ్రకరూరు,పందికుంట, గంజికుంట తదితర గ్రామాల్లో రైతుల పొలాల్లో ప్రాథమిక సర్వే, పరిశీలన చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 18,000 హెక్టార్లకుగానూ ఇప్పటివరకు 11,437 మంది రైతులు 13,576 హెక్టార్లకు, డ్రిప్,స్ప్రింక్లర్ల మంజూరుకు 451 రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. వజ్రకరూరు మండలంలో ఇప్పటివరకు 791 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. జైన్‌కంపెనీ డీసీఓ అవినాష్, జైన్ కంపెనీ డీలర్ రామసుబ్బయ్య, ఎస్‌సీఓ సురేష్, వీహెచ్ఏ కృపారాణి,రైతులు తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

బెళుగుప్ప: గుండ్లపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనింది. వరి గడ్డిని తరలించి ట్రాక్టర్ తిరిగి నాగిరెడ్డిపల్లికి వెళ్తుండగా కళ్యాణదుర్గానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనింది. ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న పురుషోత్తం అనే వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనపై ఇరు వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

కుందుర్పి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద నివాసముంటున్న కురుబ అంకిత సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఎస్ఐ నగేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

గుమ్మఘట్ట: గోనబావిలో త్రివేణి అనే యువతి ఇంట్లో ఉరివేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన ఈరన్న, శివమ్మ దంపతుల కుమార్తె త్రివేణి కడుపునొప్పితో బాధపడుతుండేది. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

రాయదుర్గంలో బేల్దారి

రాయదుర్గంటౌన్: స్థానిక రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన బేల్దారి ఎం.శ్రీనివాసులు(32) ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకుని మూడు రోజులు కావస్తునట్లుగా నిర్ధారించారు. ఆయనకు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. బళ్లారిలోని మోకాలో బేల్దారిగా పనిచేస్తూ భార్యాపిల్లలతో కలసి జీవనం సాగిస్తుండేవాడు. గత గురువారం రాయదుర్గంలోని తన ఇంటికి వచ్చిన ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లుగా సమాచారం. కాగా, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తప్పిన ప్రమాదం

కూడేరు: స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో సోమవారం ప్రమాదం తప్పింది. సుజలాన్ కంపెనీ గాలిమర రెక్కను కంటైనర్ దింపి అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపైకి వెళ్తుండగా, ఉరవకొండ నుంచి అనంతపురం వెళ్తున్న కారు అదుపుతప్పి కంటైనర్‌ను ఢీకొంది. అందులో ఉన్న బోయపాటి రాజగోపాల్, అతని కూతురు ద్రిత స్వల్పంగా గాయపడ్డా రు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

నిర్లక్ష్యం చేస్తే తప్పదు కన్నీటి కష్టం



- వేసవిలో ముంచుకొస్తున్న ముప్పు
- మేల్కోకపోతే గ్రామాల్లో నీటి ఎద్దడి
- చేతి పంపుల మరమ్మతులపై దృష్టి పెట్టని అధికారులు
- ఇప్పటికే బోరుబావుల నీరు తెచ్చుకుంటున్న వైనం



కంబదూరులో మరమ్మతుకు గురైన చేతిపంపు



దోనేకల్లులో బోరుబావి నుంచి ఎడ్లబండిపై నీరు తెచ్చుకుంటున్న దృశ్యం



ఉరవకొండలో మరమ్మతుకు నోచుకోని చేతిపంపు

ఉరవకొండ: వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. దీంతో పాటు జలాశయాల్లో నీటి మట్టం రోజు రోజుకూ తగ్గుతోంది. ఇలాంటి పరిస్థితిల్లో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి మరింత తీవ్ర రూపం దాల్చనుంది. కొళాయిల ద్వారా నీరు సరఫరా కాకపోతే ఇక చేతి పంపులే దిక్కు. అయితే చాలా చోట్ల చేతిపంపులు మరమ్మతుకు నోచుకోక అలంకారప్రాయంగా మారాయి. గ్రామాల్లో చేతిపంపులు పనిచేయకపోవడంతో ఎడ్లబండ్లు, ద్విచక్ర వాహనాలపై వ్యవసాయ తోటలు, బోరుబావులు, బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో 2,530 చేతింపులు ఉన్నాయి. ఇందులో 1,094 మరమ్మతుకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి తాగునీటి పథకం కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో వారు ఏక్షణమైనా సమ్మెబాట పట్టడం ఖాయంగా కన్పిస్తోంది. కార్మికులు సమ్మెలోకి వెళితే గ్రామాల్లో తాగునీటి కటకట తప్పదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని చేతిపంపులను మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతులపై దృష్టి పెట్టని అధికారులు..

గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి పథకాలు లేనప్పుడు చేతిపంపులే దిక్కుగా ఉన్నాయి. చాలా చోట్ల చిన్నపాటి మరమ్మతులు చేస్తే నీరు సమృద్ధిగా వచ్చే పంపులు ఉన్నాయి. వాటిని అధికారులు మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. చేతిపంపులు మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో బోర్లలో నీటి మట్టం తగ్గి భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి.

మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో మరమ్మతుకు నోచుకోని చేతిపంపులను గుర్తించి, వాటిని వెంటనే మరమ్మతులు చేయిస్తాం. క్రాష్ కార్యక్రమం కింద వీటి మరమ్మతులకు నిధులు కేటాయించారు. గ్రామాల్లో చేతిపంపుల నిర్వహణ ఎంతో అవసరంగా మారింది. వేసవిని దృష్టిలో ఉంచుకొని చేతిపంపుల మరమ్మతులు చేయిస్తే ప్రజలకు ఊరట కలుగుతుంది.

– అంజుమన్‌సత్రీన్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉరవకొండ

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో చేతిపంపుల వివరాలు..		
రాయదుర్గం నియోజకవర్గం		
మండలం	మొత్తం చేతిపంపులు	పనిచేయని పంపులు
రాయదుర్గం రూరల్	290	181
కణేకల్లు	131	52
డి.హిరేహాల్	139	42
గుమ్మఘట్ట	189	100
బొమ్మనహాల్	190	100
	939	475

కళ్యాణదుర్గం నియోజకవర్గం		
మండలం	మొత్తం చేతిపంపులు	పని చేయనవి
కళ్యాణదుర్గం రూరల్	112	42
బ్రహ్మసముద్రం	110	36
కంబదూరు	103	43
కుందుర్పి	129	32
శెట్టూరు	115	31
	569	184

ఉరవకొండ నియోజకవర్గం		
మండలం	మొత్తం చేతిపంపులు	పనిచేయని పంపులు
ఉరవకొండ	325	155
బెళుగుప్ప	157	80
కూడేరు	157	85
వజ్రకరూర్	220	62
విడపనకలు	163	53
	1,022	435

సజావుగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు



రాయదుర్గంలో హాల్ టికెట్ నంబర్, రూమ్ చూసుకుంటున్న విద్యార్థులు

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం: రాయదుర్గం పట్టణంలోని మూడు కేంద్రాల్లో ఇంటర్మీయడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి సజావుగా ప్రారంభమయ్యాయి. పరీక్షలకు 1,018 మంది విద్యార్థులకు గాను 1,008 మంది హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సెంటర్‌లో 178 మంది పరీక్షలు రాశారని చీఫ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో 510 మందికి గాను ఏడుగురు, ఆదర్శ కళాశాలో 330 మందికి గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు విజయలక్ష్మీ, అశోక్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారుల బృందం తనిఖీ చేసింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మొత్తం నాలుగు కేంద్రాల్లో తెలుగు, హిందీ, సంస్కృతం, జీఎఫ్‌సీ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో 1,320 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,268 మంది పరీక్షలకు హాజరయ్యారు. 52 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చిన్నారిని పరామర్శిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: కూడేరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యోగేశ్వరి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన యోగేశ్వరి పుట్టినిల్లు మర్తాడు కాగా, మెట్టినిల్లు కణేకల్లు మండలం పూలచెర్ల గ్రామం. వైఎస్సార్‌సీపీ కార్యకర్త అయిన మహాబలేష్ భార్య యోగేశ్వరి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కూతురు తీవ్రంగా గాయపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. మెట్టు గోవిందరెడ్డి అనంతపురం ప్రభుత్వాసుపత్రికెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్యపడొద్దని.. అన్ని విధాలుగా అండగా ఉంటానని, మహాబలేష్‌కు ధైర్యం చెప్పారు. రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.బ్రహ్మానందరెడ్డి, వైస్ కన్వీనర్ వేమన పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా వైఎస్సార్‌సీపీ నాయకులు కోళకుర్తి జయరామిరెడ్డి, చిక్కణ్ణ, బోయ రవి, నాగరాజు, రవిప్రకాష్‌రెడ్డిలు పూలచెర్ల గ్రామానికెళ్లి యోగేశ్వరి భౌతికాయానికి పూలమాలలేసి, నివాళులర్పించారు.

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలి



మాట్లాడుతున్న నారాయణ రెడ్డి

కూడేరు: హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువకు కాంక్రీట్ లైనింగ్ పనులు ఆపాలని ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఎంపీపీ నారాయణ రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి రైతులకు మేలు చేసే ఆలోచన లేదని మండిపడ్డారు. హంద్రీ నీవా కాలువ గుండా నీరు పారితే కాలువకు ఇరువైపులా కిలోమీటర్ల దూరం భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.ఎంఎంహళ్లి, పి.నారాయణపురం, జయపురం, చోళ సము ద్రం, తిమ్మాపురం, కరుట్లపల్లితో పాటు మరికొన్ని గ్రామాల్లో హంద్రీ నీవా కాలువలో ప్రవహించే నీటితో సుమారు 10 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. పనులు ఆపకపోతే రైతుల పక్షాన నిలిచి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు చోళసముద్రం గంగాధర్, శంకరయ్య పాల్గొన్నారు.

రథం నిర్మాణానికి రూ.1.25 లక్షల విరాళం

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వరుడి రథం నిర్మాణానికి పలువురు సోమవారం విరాళాలు అందించారు. కుమ్మర ఓబుళప్ప,నల్లమ్మ (వైఎస్సార్ సీపీ నేత) దంపతులు రూ. 50,116, రామదుర్గం క్రిష్టప్ప,లక్ష్మీదేవి (వైఎస్సార్ సీపీ నేత) దంపతులు రూ. 50,116లు, కటిక చట్వోజీ రావు(లేట్) భార్య లక్ష్మీబాయి రూ.25 వేలు నిర్వాహకులు కుశాల నాగరాజు, అర్చకుడు మహేష్‌కు అందించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది సాయి, ఆలయ సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు పథకాలు



పెద్దముష్టూరులో రబీ పంటల నమోదును ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

ఉరవకొండ/కూడేరు: రైతులు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం ఆర్‌ఎస్‌కే కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని, తద్వారా పథకాలు వర్తిస్తాయని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తెలిపారు. మండలంలోని పెద్దముష్టూరులో చిన్నహనుమప్ప, రాకెట్లలోని ఉదయలక్ష్మి పొలాలను రబీ పంటల నమోదు, పంటల రికార్డులను సూపర్‌చెక్‌లో భాగంగా సోమవారం పరిశీలించారు. ఏఓ శుభకర్‌ను అడిగి పంటల నమోదు వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది భీమేష్, రాధిక, రామ్మూర్తి పాల్గొన్నారు.

లంచం ఇవ్వడమూ నేరమే..

లంచం తీసుకోవడంతో పాటు ఇవ్వడమూ నేరమేనని ట్రైనీ కలెక్టర్ వినూత్న ప్రజలకు తెలిపారు. సోమవారం కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ వినూత్న పాల్గొన్నారు. భూ, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి వినతులు అధికంగా వచ్చాయి. అడిగినంత డబ్బులిచ్చినా భూసమస్యలు పరిష్కారం కాలేదని ట్రైనీ కలెక్టర్ దృష్టికి పలువురు తెచ్చారు. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరంలేదని, డబ్బులు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తే కలెక్టర్‌కు రిపోర్టు పంపుతామని రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ హనుమప్ప, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కేశవ, ఏఓ విజయ కుమార్, పశు వైద్యాధికారి శ్వేత, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, ఏపీఎం దేవానంద ఫిలిప్సన్, ఎంఈఓ మహమ్మద్ గౌస్, పీఆర్ ఏఈ రమణయ్య, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏపీఓ తులసీ ప్రసాద్, హెల్త్ సూపర్ రవీంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలని పాదయాత్ర



వజ్రకరూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

విడపనకల్లు: ఉరవకొండ నియోజకవర్గం నుంచి ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు కలెక్టరేట్ వరకు రైతు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, మండల నాయకులు ఓబుళేసు, బోయ వెంకటేశులు, సురేష్ సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్స్ జొన్న రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతూ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు.

పాదయాత్ర పోస్టర్ల విడుదల

వజ్రకరూరు: రైతులకు గిట్టబాటుధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న నుంచి చేపట్టను న్న రైతుల పాదయాత్రను జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మెయిన్ బజార్‌లో రైతుల పాదయాత్ర, కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూ పాక్షి, రైతుసంఘం నాయకులు ఓబుళపతి, షెక్షావలి, సుధాకర్, నాగన్న, శివ, రంగయ్య పాల్గొన్నారు.

వడదెబ్బ, దోమల నియంత్రణపై అవగాహన



వేపరాళ్లలో వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్

రాయదుర్గంటౌన్: ఎండల పెరుగుతున్న దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందొచ్చని, పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని వేపరాళ్ల గ్రామంలో వడదెబ్బ నుంచి రక్షించుకునే విధానం, దోమల నియంత్రణపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. దోమల నివారణకు వారానికోమారు డ్రైడే పాటించి దోమలు పెరుగకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. రాత్రిపూట దోమ తెరలు వాడాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా చల్లని ప్రదేశాల్లో ఉండానికి ప్రయత్నించాలని, ఎండలో గొడగును వినియోగించాలని, పలుచని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలన్నారు. రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలని, టోపీ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బసిరెడ్డి అచ్చమ్మ, హెల్త్ అసిస్టెంట్ నరసింహ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బొమ్మలింగేశ్వర స్వామి జాతర



పూజలు అందుకుంటున్న బొమ్మలింగేశ్వరస్వామి

కుందుర్పి: బెస్తరపల్లిలో బొమ్మలింగేశ్వర, ఈరన్న స్వాముల జాతర సోమవారం వైభవంగా జరిగింది. యాదవ వంశస్తులు రూ. 50 లక్షలు వెచ్చించి ఆలయ పరిసరాలను అభివృద్ధి చేశారు. కర్ణాటక, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని 30 గ్రామాల నుంచి యాదవుల కులదైవాలు వచ్చి పూజలందుకోవడం విశేషం. ఉదయం గ్రామోత్సవం, ధ్వజ స్తంభం ఏర్పాటు, విడిది ఉత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య, తదితర నాయకులు స్వామిని దర్శించుకున్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు

కుందుర్పి: గుడిబండ ఆంజనేయస్వామి రథోత్సవంలో భాగంగా సోమవారం రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు చెందిన 13 జతల ఎద్దులు రాతి దూలం లాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి విజేతకు రూ.40వేలు, రెండో విజేతకు రూ.30వేలు, మూడో విజేతకు రూ.20వేలు, నాల్గో విజేతకు రూ.15వేలు, ఐదో విజేతకు రూ.10 వేలు నగదు బహుమతిని ఆలయ కమిటీ అందించింది.

పేదింటి బిడ్డ డాక్టరయ్యాడు



నిరంజన్

విడపనకల్లు: కూలికెళ్తేగానీ పూటగడవని కుటుంబంలో ఓ యువకుడు కష్టపడి చదివి డాక్టరై సంతోషాన్ని నిం పాడు. మండలంలోని కరకముక్కలకు చెందిన పరంగి గోపాల్, ఉమాదేవి దంపతుల కుమా రుడు నిరంజన్‌ను ఆర్డీటీ సహకారంతో ఉన్నత చదువు చదివించారు. నిరంజన్ తిరుపతి శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన కాన్వొకేషన్‌లో నిరంజన్ పట్టా అందుకున్నాడు.పేదింటి విద్యాకుసుమం డాక్టర్ అ య్యాడని గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

ఉరవకొండ: పిల్లలతో సహా తల్లి కనిపించకుండా పోయిన ఘటన ఉరవకొండలో వెలుగు చూసింది. భర్త చేసిన ఫిర్యాదు మేరకు... ఉరవకొండకు చెందిన వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి గుంతకల్లుకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. వారి ఆచూకీ కోసం భర్త రవితేజ గాలించినా ఫలితం లేకపోయింది. అతని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ మహానంది తెలిపారు. ఆచూకీ తెలిస్తే సెల్: 94901 08514 (సీఐ), 94407 40876 (ఎస్ఐ)లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

నేడు సుంకలా పార్వతి రథోత్సవం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో వెలసిన సుంకలా పార్వతి దేవి రథోత్సవం మంగళవారం సాయంత్రం జరుగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సుంకలా పార్వతి దేవి విగ్రహానికి జలాభిషేకం అనంతరం పూజలు చేశారు. సుంకలా పార్వతీదేవి రథోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచు రాణి వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. ప్రధాన వీధిలో కాలువలు శుభ్రం చేయించారు. ఆలయం ఎదుట గ్రావెల్ (మట్టి) తోలించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

బొమ్మనహాళ్: గోవిందవాడలోని సచివాలయంలో పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి వైద్య నిపుణులు మల్లి పరీక్షించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. శుక్లాలు ఉన్న 41 మందికి శస్త్రచికిత్స చేస్తామన్నారు.

వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేసిన డీడీ

ఉరవకొండ: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న ఉచిత పశు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ డీడీ జి.వెంకటేష్ సోమవారం తనిఖీ చేశారు. రాకెట్లలో వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. డీడీ మాట్లా డుతూ ఈనెల 30 వరకు నిర్వహించే పశువ్యాధి నియంత్రణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

కాలిపోయిన మామిడిచెట్లు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బొట్టువాని పల్లి గ్రామం సమీపంలో రైతు తిమ్మరాయుడుకి చెందిన వ్యవసాయ క్షేత్రం కంచె సమీపంలో ఆకతాయిలు నిప్పుపెట్టారు. దీంతో దాదాపు 20 ఎకరాల మామిడి తోట చుట్టూ ఏర్పాటు చేసిన కంచె, 15 మామిడి చెట్లు కాలిపోయాయి. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.1.50 లక్ష నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపాడు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

కళ్యాణదుర్గం: స్థానిక రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ వసంతబాబుకు వినతి పత్రం అందించారు.

వేరుశనగ పొట్టు ట్రాక్టర్ బోల్తా

వజ్రకరూరు: మండలంలోని కడమలకుంట సమీపంలోని ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిపై వేరుశనగ పొట్టుతో వెళ్తున్న ట్రాక్టర్ సోమవారం సాయంత్రం బోల్తాపడింది. కర్నూలు జిల్లా చిప్పగిరిమండలం బెల్డోణాకు చెందిన రైతు కూడేరు నుంచి వేరుశనగ పొట్టు వేసుకొని వెళ్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది.

చెత్తతో సంపద తయారీపై శిక్షణ

బొమ్మనహాళ్: చెత్త సేకరించి సంపద తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్ సోమవారం తెలిపారు. మంగళవా రం బొమ్మనహాళ్, గుమ్మఘట్ట కార్యదర్శులకు, హరితరాయబారులకు బుధవారం రాయదుర్గం, డి.హీరేహాళ్ మండలాల వారికి శిక్ష ణ ఉంటుందని ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీలు తెలిపారు.